ఉత్తర ద్వారా దర్శనం

కమలాపురం : రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం కార్తీక శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథశర్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య


మృతి చెందిన శైలజ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని స్వప్న హోటల్ వీధిలో నివాసం ఉండే కల్లూరు శైలజ (32) అనే మహిళ ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కమలాపురం మండలంలోని కంచన్నగారిపల్లె గ్రామానికి చెందిన వీ రారెడ్డితో ఆరేళ్ల క్రితం శైలజకు వివాహమైంది. వీరారెడ్డి ఎర్రగుంట్లలోని ఓ ట్రాన్స్‌పోర్టులో గుమస్తాగా పని చేసేవాడు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇరువురు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. కానీ రెండేళ్ల నుంచి శైలజ మానసిక స్థితి సరిగా లేదు. సోమవారం రాత్రి భర్త వీరారెడ్డి డ్యూటీకి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి పిలిస్తే ఆమె తలుపులు తీయ లేదు. దీంతో అదే వీధిలో ఉన్న తండ్రి కల్లూరు రామాంజనేయరెడ్డిని పిలిచి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉంది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నిరాశ మిగిల్చిన ఖరీఫ్‌.. రబీపై ఆశలు


వర్షాంభావంతో దెబ్బతింటున్న శనగ పంట


సాగులో వున్న మినుము

వర్షాభావంతో రైతన్న డీలా

ముద్దనూరు : ఖరీఫ్‌ సాగులో తీవ్ర వర్షాభావంతో మండలంలోని అన్నదాతలు ఆశలు ఆవిరయ్యాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్‌ సీజన్‌లో సాగు చేసిన పంటలన్నీ అన్నదాతలకు ఆర్థిక నష్టాలను మిగిల్చాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు వరుణుడిపై ఆశలు పెట్టుకుని పంటల సాగులో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఈ రబీ సీజనులో శనగ, మినుము, జొన్న, ప్రత్తి, కంది వీటితో పాటు కూరగాయాల సాగు అధికంగా వుంది. ప్రస్తుతం మండలంలో శనగ 1800 ఎకరాలలో, మినుము, 800 ఎకరాలలో, కంది 1900 ఎకరాలలో సాగులో వుంది. అయితే ఆశించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో ఈ పంటల దిగుబడి ప్రశ్నార్థకంగా మారిందని, వర్షాభావం పరిస్థితి ఇలాగే కొనసాగితే పంటలు ఎండిపోయి తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం వుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శనగ, మినుము పంటలు సాగుచేసిన వారు వర్షంకోసం ఎదురుచూస్తున్నారు.

శనగపంటకు నష్టం వాటిల్లుతుంది



ఇప్పటికే శనగ పంట సాగుచేసిన రైతులు వర్షం కురవకపోవడంతో ఆందోళనతో వున్నారు. మరి కొద్ది రోజుల్లో వర్షం కురవకపోతే శనగ పంటకు నష్టంవాటిల్లితుంది. గత ఖరీఫ్‌ సీజనులో కూడా అరకొర వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి.

– ప్రసాద్‌రెడ్డి, రైతు, చిన్నదుద్యాల

వర్షంకోసం ఎదురుచూపు



సుమారు 5 ఎకరాల్లో వేర్వేరుగా శనగ,మిననుము సాగుచేసాను.ఇప్పటికే బెట్టతో పంటలకు నష్టంజరుగుతోంది.15 రోజుల్లో వర్షం కురవకపోతే పంటలు ఎండిపోతాయి.శనగ సాగుపై ఆశతో అన్నదాతలు పెట్టుబడులు పెట్టారు.వర్షంకోసం ఎదురుచూస్తున్నాము.

– రాజుల రమణారెడ్డి, రైతు, రాజులగురువాయిపల్లె

నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి



ఈనెనెలాఖరు వరకు వర్షాలు కురవకపోతే ముఖ్యంగా శనగ, మినుము, కంది పంటలకు ఇబ్బంది కలుగుతుంది. అన్ని పంటల సాగులో బెట్ట నివారణకు రైతులు చర్యలు చేపట్టాలి. 20 గ్రాముల యూరియాను 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే బెట్టను నివారించుకోవచ్చు.

– వెంకటకృష్ణారెడ్డి, మండలవ్యవసాయాధికారి

17 నుంచి పంట నమోదు

కమలాపురం : రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 17వ తేదీ నుంచి నమోదు చేస్తామని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని చదిపిరాళ్ల, రామచంద్రాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది... కార్యక్రమంలో ఆమె రైతులకు పంటల సాగులో పాటించాల్సిన మెలకువలను వివరించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 17వ తేదీ నుంచి నమోదు చేస్తామన్నారు. పంటలు సాగు చేసిన రైతులందరూ తమ పరిధిలోన రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను సంప్రదించి తమ పంటల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఫసల్‌ బీమా శనగ, వేరుశనగకు రూ.480 చెల్లించాలన్నారు. మినుముకు రూ.285, జొన్నకు రూ.315, వరికి రూ.630, నువ్వు పంటకు రూ.180 చొప్పున ఏకరాకు రైతు వాటా చెల్లించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగు చేసిన జొన్న, శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జొన్న పంటకు కత్తెర పురుగు, మోగి పురుగు, కాండం తొలిచే పురుగు ఆశించిందన్నారు. వాటి నివారణకు 500 మి.లీ. బొరడైజ్‌, లేదా 100మి.లీ. అంప్లిగ్రో పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ మమత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు విద్య నేర్పించాలి

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్ష రాస్యులకు విద్య నేర్పించాలని వయోజన విద్యా శాఖ ఏడీ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీపీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన అంగన్‌వాడీ వర్కర్లు, వెలుగు వీఓఏలకు ఉల్లాస్‌ కార్యక్రమం పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్లకు పైబడిన నిరక్ష రాస్యులందరికి అక్షరాలు నేర్పించడమే ఉల్లాస్‌ లక్ష్యం అన్నారు. మండలంలో మొదటి విడతగా 585 మంది నిరక్ష రాస్యులను గుర్తించామన్నారు. ప్రతి రోజు సాయంతం అంగన్‌వాడీ సెంటర్లు, లేదా వీఓఏల ఇళ్ల వద్ద గాని నిరక్ష రాస్యులందరికీ అక్షరాలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం గంగాధర్‌, ఎంఈఓ సుభాషిణి, ఈఓపీఆర్‌డీ కెజియా, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచర్ల గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌ రూరల్‌ ఫోక్‌ ఆర్ట్‌ అవేర్‌నెస్‌ ఆర్గనైజేషన్‌ కళాజాత బృందం వారు మాటల ద్వారా, పాటల ద్వారా, మ్యాజిక్‌ షో ద్వారా బ్యాంకు పథకాలు, ఇన్సూరెన్స్‌ పథకాల గురించి అవగాహన కల్పించారు.

లింగాల : నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం కల్గించేందుకు వయోజన విద్యా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం లింగాల ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు వయోజన విద్యపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు.

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధించాలని మండల అబివృద్ధి అధికారి చంద్రమౌలీశ్వర్‌ తెలిపారు. మంగళవారం మండల పరిషత్‌ సభా భవనంలో నిర్వహించిన వయోజన విద్యపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఇళ్ల నిర్మాణ పనులలో వేగం పెంచాలి


హౌసింగ్‌ కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్‌ శాఖ పీఈ రాజారత్నం

ఎర్రగుంట్ల : పట్టణం, మండల పరిధిలో నిర్మాణ పనులలో వేగం పెంచాలని హౌసింగ్‌ శాఖ పీడీ రాజారత్నం తెలిపారు. మంగళవారం పట్టణంలోని హౌసింగ్‌ లేఅవుట్‌ కాలనీని పరిశీలించి అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. లబ్ధిదారులు వారికి కెటాయించిన ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు.

వచ్చే ఏడాది మార్చినెల నాటికి పనులు పూర్తి కావాలన్నారు. బిల్లులు వాడుకున్న లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులను రిక వరీ చేయాలన్నారు. కాలనీలో రోడ్లు చాలా ఆ ధ్వ నంగా ఉన్నాయని వెంటనే రోడ్డు వేయాలని, అలా గే నీటి సదుపాయ లేదని లబ్ధిదారులు వారితో మొ రపెట్టుకున్నారు. కమిషనర్‌ శేషఫణి, హౌసింగ్‌ ఏఈ రామకృష్ణయ్య, వర్కింగ్‌ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్‌బాషా, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడి


మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

జమ్మలమడుగు : రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించి పంటలను సాగుచేస్తే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గూడెంచెరువు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం రైతులు సాగుచేసే వరి పంటలను ఆశించే ఆకుముడత, నల్లిమెడ విరుపుతెగులు చీడ పీడలు వస్తున్నాయి.

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం పెండ్లిమర్రి గ్రామ పొలాల్లో సాగులో ఉన్న మినుము పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట సాగు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. విత్తన శుద్ధి చేయడం వల్లన భూమిలోని వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. పంటల సాగులో చీడ పీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

వేముల : పంటలు సాగు చేసిన రైతులు డిసెంబర్‌ 15వ తేదీలోపు పంటల బీమా ప్రీమియం కట్టాలని వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం మీదిపెంట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

నేడు కల్యాణ మండపం ప్రారంభం

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామ సమీపాన దాతల సహకారంతో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన గురుకుంట్ల కల్యాణ మండపాన్ని బుధవారం కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి వుండాలి

వల్లూరు : ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ గురించి అవగాహన కలిగి వుండాలని చైల్డ్‌ ఫన్డ్‌ ఇండియా జోనల్‌ సూపర్‌వైజర్‌ దర్బార్‌ తెలిపారు. మండలంలోని లేబాక గ్రామంలో మంగళవారం చైల్డ్‌ ఫండ్‌ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌, టీబీ వ్యాధులు సంక్రమించే మార్గాలను గురించి వివరించారు.

సత్ప్రవర్తనతో అనుకున్న గమ్యాన్ని సాధిస్తారు

పులివెందుల రూరల్‌ : సత్ప్రవర్తనతో మెలిగినప్పుడే అనుకున్న గమ్యాన్ని సాధిస్తారని ఐసీడీఎస్‌ సీడీపీఓ శ్రీలత తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర వికాస కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. లీగల్‌ ఆఫీసర్‌ సునీత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ నాగేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

వేంపల్లె : జిల్లా వ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం స్థానిక ఎస్‌టియూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏటా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కాగా అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్డీఏ ప్రభుత్వం ఎన్టీఆర్‌ రైతు భరోసా పథకం కింద ఇచ్చే పెట్టుబడి సాయం గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమావేశంలో పులివెందుల ఏరియా కార్యదర్శి రాములు, సీపీఐ మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తెగులు నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

వీరపునాయునిపల్లె : రైతులు సాగు చేసిన మినుము పంటలో పల్లాకు తెగులు సోకిందని నివారణపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లె, సంగాలపల్లె గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో అధిక దిగుబడులు సాదించాలని రైతులకు సూసించారు. అనంతరం మినుము, బుడ్డ శనగ, జొన్న పంటలను పరిశీలించిన ఆయన పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సుధా, రైతులు పాల్గొన్నారు.

అక్షర వెలుగుపై అవగాహన సదస్సు

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం వెలుగు ఆనిమేటర్లకు అక్షర వెలుగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమూర్తి కుటుంబం, ఇరుగు పొరుగు, ఎన్నికలు పలు అంశాలపై రూపొందించిన పుస్తకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ శారదమ్మ, ఏపీఎం మంజునాథ్‌, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు ఆనిమేటర్లు పాల్గొన్నారు.

కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

జమ్మలమడుగు : కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్‌ శ్రీనివాసులరెడ్డికి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సరైన వర్షాలు లేక వ్యవసాయంపై ఆధారపడిన వారందరూ పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే అసెంబ్లీ ఆర్థిక బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం దారుణం అన్నారు. ప్రజలు తీవ్ర కరువుతో ఇబ్బందులు పడుతుంటే విద్యుత్‌ చార్జీలను పెంచడం అన్యాయమన్నారు.

వారం రోజుల్లో పందులను తరలించాలి

జమ్మలమడుగు : పట్టణంలోని పందుల యజమానులు తమ పందులను వారం రోజుల లోపు బయటి ప్రాంతాలకు తరలించాలని మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట్రామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన శబరి కాలనీలో ఉన్న పందుల యజమానులతో మాట్లాడారు. గతంలో తాము పట్టణంలో పందులు లేకుండా చేయాలని సూచించినా నిర్లక్ష్యం చేయడం సరైందికాదన్నారు. పందుల వల్ల ప్రజలకు తదితర వ్యాధులు వచ్చె ప్రమాదం ఉంది. వారం రోజుల లోపు పందులను తొలగించకపోతే 1965లోని సెక్షన్‌ 255 ప్రకారం చట్టపరమైన చర్యలను తీసుకుంటామన్నారు.

ఎనిమిది ట్రాక్టర్లు సీజ్‌

చక్రాయపేట : మండలంలోని పాపాఘ్ని నదినుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవా రం సీజ్‌ చేశారు. మండలంలోని ఎర్రబొమ్మనపల్లె, కుమార్లకాల్వ గ్రామాల పరిధిలో గల పాపాఘ్ని నది నుంచి మూడు రోజులుగా కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పాపిరెడ్డి అనే వ్యక్తి మంగళవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన తహసీల్దార్‌ విజయకుమారి, ఎస్‌ఐ కృష్ణయ్య సిబ్బందితో వెళ్లి ఇసుక నింపిన 4 ట్రాక్టర్లతో పాటు నదిలోనే ఇసుక కోసం ఉన్న మరో 4 ఖాళీ ట్రాక్టర్లను తహసీల్దార్‌ కార్యాలయానికి తరలించారు.

టిప్పర్‌ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల : పోట్లదుర్తి గ్రామం నుంచి ఆర్టీపీపీకి వెళ్లే రహదారిలో టిప్పర్‌ ఢీకొనడంతో దేవరపల్లి లోకేష్‌ అనే యువకుడికి తీవ్ర గాయాలైనట్లు ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు తెలిపారు. ముద్దనూరు మండలం చౌటిపల్లి గ్రామానికి చెందిన దేవరపల్లి లోకేష్‌ అనే యువకుడు ముద్దనూరు నుంచి ప్రొద్దుటూరుకు పోట్లదుర్తి మీదుగా బైకులో బయలు దేరాడు. పోట్లదుర్తి గ్రామంలోని ఎంపీ సీఎం రమేష్‌ నాయుడు ఇంటి వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఏపీ39 వీడీ3885 నంబరు గల టిప్పర్‌ డ్రైవర్‌ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి బైకును ఢీకొన్నాడు. దీంతో బైకుపై వస్తున్న లోకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కాపర్‌ వైర్లు చోరీ

లింగాల : పెద్దకుడాల గ్రామంలో రైతుల పొలాల సమీపంలో నిర్మించుకున్న గ్రేడింగ్‌ హౌస్‌ల వద్ద రెండు సింగిల్‌ ఫేజ్‌ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారని విద్యుత్‌ ఏఈ రమేష్‌ బాబు తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డి, శివకృష్ణారెడ్డిలకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్‌ వైర్‌ దొంగిలించినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.

చెత్త లేకుండా చూడాలి

వేముల : మురికి కాలువల్లో చెత్తా చెదారాలు లేకుండా చూడాలని మలేరియా సబ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ సిద్ధయ్య తెలిపారు. మంగళవారం బెస్తవారిపల్లెలో బోధ వ్యాధి సర్వే నిర్వహించి రక్తపూతల సేకరణ చేశారు.

విద్యార్థుల ప్రతిభ

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : కడపలోని అన్నమాచార్య ఇంజనీరింగ్‌ కళాశాలలో నిర్వహించిన స్మార్ట్‌ ఇండియా హకతాన్‌ ప్రోగ్రాంలో అన్నమాచార్య ఇంజనీరింగ్‌ కళాశాల నుంచి ఒక టీం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గ్రాండ్‌ ఫినాలేకి అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఉల్లాస్‌ శిక్షణ కార్యక్రమం

వేముల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఎంపీడీఓ మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన వలంటీర్లు, టీచర్లకు ఉల్లాస్‌ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చదువురానీ 10 మంది డ్వాక్రా మహిళలను గుర్తించి రోజు 2 గంటలపాటు వలంటీర్‌ ఉల్లాస్‌ శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

విద్యార్థుల ఎంపిక

సింహాద్రిపురం : ఈనెల 8,9వ తేదీలలో కమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్‌-14 బాల, బాలికల రగ్బీ పోటీలలో సింహాద్రిపురంలోని శ్రీవివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల కరస్పాండెంట్‌ ఖాదర్‌వల్లి తెలిపారు.

పూర్తి సమాచారం అందించాలి

పులివెందుల రూరల్‌ : పశువులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని అందించాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు మంగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఆయన రైతుకు పశువుల సమాచార పత్రాన్ని అందించారు.

యురేనియం ప్రాజెక్టును సందర్శించిన విద్యార్థులు

వేముల : 70వ డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ అటామిక్‌ ఎనర్జీ ప్లాటినం జూబ్లీ వేడుకల ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మలపల్లె యురేనియం కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ను మంగళవారం తొండూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు సందర్శించారు. సందర్భంగా ప్రోగ్రాం యాంకరింగ్‌ విపిన్‌కుమార్‌ శర్మ అధునాతన మైనింగ్‌, ఖనిజ ధాతువు, ప్రాసెసింగ్‌ పద్ధతుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూసీఐఎల్‌ డీజీఎం సుమన్‌ సర్కార్‌, యూసీఐఎల్‌ హెచ్‌ఓడీ కిశోర్‌ భగవత్‌లు న్యూక్లియర్‌ ఎనర్జీ బెనిఫిట్స్‌, సేఫ్‌ ఎనర్జీ ప్రొడక్షన్‌ వైపు విద్యార్థులను ప్రేరేపించడంతోపాటు యూనిట్ల సమాచారాన్ని అందించారు. అనంతరం వారు కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులకు డీఏఈ మెమెంటో, సమాచార బ్రోచర్లను అందించారు.

రైతులే ప్రీమియం చెల్లించాలి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : మండలంలోని నరసన్నపల్లి, రసూల్‌పల్లి గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రబీ 2024–2025 సంవత్సరానికి పంటల బీమా ప్రీమియం ఇక మీదట రైతులే చెల్లించవలసి ఉంటుందన్నారు. రబీ వెదర్‌ బేస్‌ క్రాప్‌ ఇన్సూరెన్స్‌కు మన జిల్లాలో పంటలు ఎంపిక కాలేదని, ప్రధానమంత్రి ఫసల్‌ బీమా యోజన పథకంకు రబీ పంటలు ఎంపిక అయ్యాయన్నారు.

బూటకపు హామీలతో దగాపడిన రైతాంగం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రైతులకు మేలు చేస్తామని, బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో రైతులు దగ పడ్డారని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిడుజివ్వి గ్రామంలోని గ్రామ సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల భూమి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతుల తరుపున డిప్యూటీ తహసీల్దార్‌ యామినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతుల భూముల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గ్రామ రెవెన్యూ సభలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని చెప్పారు. రైతులు వారి భూములను అమ్ముకోవాలన్నా, బ్యాంకులో రుణాలు తెచ్చుకోవాలన్నా సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో పత్రాలు రాలేదన్నారు. మార్టిగేజింగ్‌ చేసుకోవాలన్నా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం కింద అందిస్తున్న రైతు భరోసా రైతుల ఖాతాలలో ఇంకా జమ కాలేదన్నారు. రైతులకు సబ్సిడీతో ఇచ్చిన పప్పు శనగ విత్తనాలు మొలకెత్తలేదని రైతులు వాపోతున్నారని తెలిపారు. మొలకెత్తని విత్తనాల వల్ల రైతులకు ఎకరాకు రూ.20 వేలు దాకా నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామక్రిష్ణారెడ్డి, వీర భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి, మహబూబ్‌వలి, విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బెంగళూరు- విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ హైవే పనుల పరిశీలన

జాయింట్‌ కలెక్టర్‌ అదితిసింగ్‌


జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న జాయింట్‌ కలెక్టర్‌ అదితిసింగ్‌

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలం మీదుగా వెళ్తున్న బెంగళూరు- విజయవాడ ఆరులేన్ల ఎక్స్‌ప్రెస్‌ హైవే పనులకు తీసుకోవాల్సిన భూములను, నిర్మాణ పనులను జాయింట్‌ కలెక్టర్‌ అదితిసింగ్‌ మంగళవారం పరిశీలించారు. ఈ ఎక్స్‌ప్రెస్‌ జాతీయ రహదారి ఎర్రగుంట్ల మండలంలో పెద్దనపాడు, తిప్పలూరు, టి. సుంకేసుల, వై.కోడూరు, ఎర్రగుంట్ల గ్రామాల మీదుగా వెళ్తోంది. ఇందుకు సంబంధించి భూ వివరాలను పరిశీలించారు. అలాగే రాయచోటి- చాగలమర్రి జాతీయ రహదారి పనులకు సంబంధించి భూ రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఎర్రగుంట్ల తహసీల్దార్‌ శోభన్‌బాబు ఈ జాతీయ రహదారికి సంబంధించిన భూ వివరాలను జాయింట్‌ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ, రెవెన్యూ, జాతీయ రహదారి శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : రాయచోటి–చాగలమర్రి మధ్య నిర్మించనున్న జాతీయ రహదారి పనులకు సంబంధించి డ్రోన్‌ ద్వారా చేపట్టిన రికార్డులను తనిఖీ చేయాలని జేసి అదితి సింగ్‌ అన్నారు. మంగళవారం వీరపునాయునిపల్లె మండల పరిధిలో రహదారికి ఇరువైపులా చేపట్టిన నిర్మాణాలను ఆమె పరిశీలించారు. రహదారి నిర్మించే భూముల ధర సెంటు రెండు నుంచి మూడు లక్షల రూపాయలు ఉందని అగ్రికల్చర్‌ ల్యాండ్‌ రేటు ప్రకారం ఇస్తే భారీగా నష్టపోతారని మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఆమెకు వివరించారు. నిర్మాణాలు చేపట్టే సమయంలో తమకు ఎలాంటి నోటీసులు అందించలేదని వ్యవసాయ అవసరాల నిమిత్తం నిర్మాణాలు చేపట్టామని పలువురు రైతులు ఆమె దృష్టికి తెచ్చారు. అనిమెల రెవెన్యూ విలేజ్‌ నుంచి గంగిరెడ్డిపల్లె రెవెన్యూ విలేజ్‌గా మార్పు చేసినప్పటికి రిజిస్టార్‌ ఆఫీసులో గంగిరెడ్డిపల్లె రెవెన్యూ కనిపించడం లేదని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ భానుశ్రీ, తహసీల్దార్‌ లక్ష్మిదేవి, ఆర్‌అండ్‌బీ అధికారులు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.